క్లుప్తంగా

వైభవంగా పెద్దమ్మ కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పెద్దమ్మ ఆలయ 2వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. అమ్మవారి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, గుమ్మాంభబలి, అష్టదిశబలి ప్రదానం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ, పట్నాలు, గావు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరులో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు గూడు కోల్పోయిన గాజుల చంద్రం, మిరుదొడ్డి తిరుపతి కుటుంబాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పరామర్శించి, ఇరువురికి రూ.5వేల చొప్పున రూ.10వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకుడు చీపురు మల్లేశ్‌యాదవ్, వార్డుసభ్యుడు యాదగిరి, నాయకులు శేఖర్, వెంకటేశ్, సాయి, ప్రశాంత్, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, బాబు పాల్గొన్నారు.

నియామకం


వెంకటేశంను సన్మానిస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): గొర్లకాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పాత్కుల వెంకటేశంను నియమించారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మారం తిరుపతిలు నియామకపత్రాన్ని శనివారం సిద్దిపేటలో అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. గొర్లకాపరుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ సభ్యుడు పయ్యావుల రాములు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య, సర్పంచ్ బొడ్డు నర్సింలు, ఏఎంసీ చైర్మన్ దోమల కొమురయ్య, దుబ్బాక ఆత్మ కమిటీ డైరెక్టర్ మల్లేశం, సంఘం నాయకులు శ్రీశైలం, అర్జున్, మల్లేశం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్, విఠలాపూర్, చౌడారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రీ స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాబు, నవీన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లల మానసిక, శారీరక, అభివృద్ధి గురించి తల్లిదండ్రులకు వారు వివరించారు. పిల్లల ఎదుగుదల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శుల నియామకం

అక్కన్నపేట(హుస్నాబాద్): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులర్ చేయాలని నిరసిస్తూ సమ్మెకు దిగడంతో ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలకు పాత పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియామిస్తూ ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శంకరయ్యకు(పోతారం(జే),రామవరం,గుడాటిపల్లి), పాత కార్యదర్శి గుగులోతు మోహన్‌నాయక్‌కు(కట్కూర్,చాపగానీతండా,దుబ్బతండా), జూనియర్ అసిస్టెంట్ ఎం.రమేశ్‌కు(అంతక్కపేట,పంతుల్‌తండా,కేశనాయక్‌తండా), పాత కార్యదర్శి లక్ష్మీకాంతరావుకు(అక్కన్నపేట,కుందనవానిపల్లి,గండిపల్లి), పాత కార్యదర్శి పి.శ్రీకాంత్‌కు(మల్లంపల్లి,మోత్కులపల్లి, పెద్దతండా), పాత కార్యదర్శి కె.సుభాష్‌కు(గోవర్ధనగిరి,రేగొండ,బొడిగెపల్లి), పాత కార్యదర్శి బోడ రాజు(చౌటపల్లి,మసిరెడ్డితండా,గొల్లపల్లి), జూనియర్ అసిస్టెంట్ ఎం.మల్లేశంకు(జనగామ,గుబ్బడి,గౌరవెల్లి), జూనియర్ అసిస్టెంట్ శంకర్‌కు(మంచినీళ్లబండ,కేశవాపూర్,గొల్లకుంట), జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్‌లు(నందారం, ధర్మారం, కపూర్‌నాయక్‌తండా)లకు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులుగా పదవీ బాధ్యతలను స్వీకరించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటలను వ్యాపారులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాలన్నారు. రైతులకు అసౌకర్యం కలగకుండా మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, వైస్ చైర్‌పర్సన్ రజిత, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, జెడ్పీటీసీ భూక్య మంగ, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆయిలేని అనిత, కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

హుస్నాబాద్‌రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి అన్నారు. శనివారం బంజేరుపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ. రైతులకు కావాల్సిన గన్నీ బ్యాగులను ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఎంపీటీసీ విజయలక్ష్మి రైతులు పాల్గొన్నారు.


హుస్నాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

నంగునూరు(సిద్దిపేట): ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. శనివారం తిమ్మాయిపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సారయ్య మాట్లాడుతూ.. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు లత, కృష్ణ, నర్సింలు, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పల్లెలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోల కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గజ్జెల సాయిలు కోరారు. మండల పరిధిలోని అల్వాల, ధర్మారం గ్రామాల్లో శనివారం వడ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ చందపురం మల్లేశం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్ అల్వాల, ధర్మారం సర్పంచ్‌లు ఎనగంటి కిష్టయ్య, గూళ్ల పుష్ప, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, సిద్దాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ సారయ్య

కుంటల్లా వీధి రోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 14వ వార్డులో గల బీసీ కాలనీలో మురికి కాల్వల వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం కురిసిన సమయంలో మురుగు నీరంతా ఇళ్లముందుకు చేరి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోగల ఎర్రవల్లి(రెడ్డికాలనీ)లో నిర్మించిన సీసీరోడ్డు ఇళ్లకంటే తక్కువ ఎత్తులో ఉండడం కారణంగా వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని, ఈ విషయంలో అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.


గజ్వేల్ 14వ వార్డు బీసీకాలనీలో ఇళ్ల ఎదుట చేరిన మురుగు నీరు

వర్గల్‌లో రోడ్డు మునకేసే..

వర్గల్(గజ్వేల్): ఓ మోస్తరు వర్షం పడితే చాలూ.. ఎగువ నుంచి వరద నీటికి వర్గల్ పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డు వరదలో మునకేస్తుంది. గంటల తరబడి నీరు నిలిచిపోయి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. శనివారం ఉదయం వర్గల్‌లో 29.6మి.మీల వర్షం కురిసింది. దీంతో భారీగా వరదనీరు చేరడంతో గ్రామ పంచాయతీ ఎదుట, భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతం జలమయమైంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఆ తర్వాత గ్రామ పంచాయతీ సిబ్బంది మ్యాన్‌హోల్ తీసి వరదనీరు వెళ్లే మార్గం సుగమం చేశారు. దీంతో మెల్లమెల్లగా వరదనీరు దిగువకు వెళ్లిపోతున్నది.


వర్గల్ గ్రామ పంచాయతీ ఎదుట జలమయమైన పరిసరాలు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: అధైర్య పడకమ్మా నేను మీ కుటుంబానికి అండగా ఉంటా.. అంటూ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. దుబ్బాక పట్టణానికి చెందిన మంతూరి శ్రీనివాస్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేల ఆర్థికసాయం అందించారు. శ్రీనివాస్ చిన్న వయసులో మరణించడం బాధాకరమన్నారు. అదేవిధంగా పట్టణానికి చెందిన తుమ్మ సరస్వతి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితభూంరెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, నాయకులు రాజమౌళిపంతులు, కిషన్‌రెడ్డి, ఎల్లారెడ్డి, తదితరులున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

మిరుదొడ్డి(దుబ్బాక): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో శనివారం జరిగిన పెద్దమ్మ, చౌడాలమ్మ ఆలయ మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దోమకొండ భాగ్యమ్మ అనే దివ్యాంగురాలితో కాసేపు ముచ్చటించారు. తనకు డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించడంతో పాటు మోటార్ ట్రై సైకిల్ కావాలని దివ్యాంగురాలు ఎంపీకి తన గోడును వెల్లబోసుకుంది. స్పందించి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి


ధాన్యం నుంచి నీటిని తొలగిస్తున్న మహిళా రైతులు

మద్దూరు(హుస్నాబాద్): అకాల వర్షాలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. శనివారం ఉదయం మండల పరిధిలోని లద్నూర్ గ్రామంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడిసిముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని, వర్షాల నేపథ్యంలో ధాన్యం మొలకెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు


బోనాల ఊరేగింపులో మహిళలు

దుబ్బాక: పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, బైండ్లోళ్ల ఆటపాటలతో దుబ్బాక ప్రధాన వీధుల్లో బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రాములోరి ముత్యాల తలంబ్రాల పంపిణీ


భక్తులకు తలంబ్రాలను అందజేస్తున్న రామకోటి రామరాజు

గజ్వేల్‌రూరల్: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలను శనివారం రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో గజ్వేల్‌లో పంపిణీ చేశారు. పట్టణంలోని మహాలక్ష్మీహోమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామకోటి రామరాజు మాట్లాడుతూ.. రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో గోటితో వలిచిన కోటి తలంబ్రాలను భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా అందించామని గుర్తుచేశారు. దేవస్థానం వారు తలంబ్రాలను ఈ ప్రాంత భక్తుల కోసం అందించారని, అక్కడి నుంచి తీసుకొచ్చిన ముత్యాల తలంబ్రాలను ఇక్కడ భక్తులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాచారం దేవస్థాన డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, మహంకాళి ఆలయ పూజారి నందు పంతులు, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాయకులు సిద్ది భిక్షపతి, సత్యనారాయణ, మెత్రాములు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రంలోని ఆడపడుచులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని దూళ్మిట్ట సర్పంచ్ దీపికవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మత సామరస్యమే మానవుని మనుగడ

సిద్దిపేటజోన్: సమాజంలో ఉన్న అన్ని ధర్మాల సారం ఒక్కటే, మత సామరస్యమే మానవుని మనుగడ అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో జరిగిన ఈద్ మిలాప్‌లో పలువురు పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ ఉమాపతి రామేశ్వరశర్మ, జమాయిత్ ఇస్లామియా హింద్ ఆంధ్రప్రదేశ్ మీడియా ఇన్‌చార్జ్ ఇమ్రాన్ షరీఫ్, సీఎస్ఐ చర్చి పాస్టర్ ఆంటోనీ, తదితరులు మాట్లాడారు. మనుషులు అందరూ సమానమే అన్నారు. అన్ని గ్రంథాలు, మతాలు బోధించే సారం ఒక్కటేనని పేర్కొన్నారు.

రెగ్యులర్ చేసే వరకు పోరాటం

రెండోరోజు కొనసాగిన కార్యదర్శుల దీక్ష


సిద్దిపేటరూరల్: మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు రాకేశ్ మాట్లాడుతూ.. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 15 రోజుల క్రితం సమ్మె నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. రెగ్యులర్ చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో జిల్లా కోశాధికారి రాజు, జాయింట్ సెక్రటరీ సతీశ్, జిల్లా మహిళా కన్వీనర్ రజిత, ఈసీ సభ్యులు రాజు, కిరణ్, మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు నరేశ్, లోకేశ్వర్‌రెడ్డి, పంచాక్షరి, రేణుక, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల కార్యాలయం వద్ద దీక్షలో రాకేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, పృథ్వీరాజ్, శ్రీనివాస్, మహేందర్, రాజమ్మ, జ్యోతి, శ్రేయ, కల్పన పాల్గొన్నారు.


గజ్వేల్‌లో..


చేర్యాలలో..

దుబ్బాక: దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో కార్యదర్శులు వెంకటస్వామి, యాదగిరి, నరేశ్, ప్రత్యూష, విమల, గోపి తదితరులున్నారు.

సిద్దిపేటరూరల్: సిద్దిపేటలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు యాదగిరి, అనిల్, శ్రీధర్, సంధ్య, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) ఆవరణలో కార్యదర్శులు 2వ రోజు సీఎం కేసీఆర్ చిత్రపటంతో సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలని విన్నవిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన శనివారం పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంశాలపై తీర్మానం చేశారు. జలశక్తి అభియాన్ పథకం కింద ప్రతి ఇంటికి, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మించేందుకు రూ.5లక్షలు కేటాయించాలని పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. అదేవిధంగా 2023–24 సంవత్సరానికి గాను పట్టణంలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వాహణ, ఆటోలు, ట్రాక్టర్లు డోజర్, వైకుంఠరథం వాహనాలకు ఆయిల్ చేంజ్, రిపేర్ల కోసం రూ.6లక్షలు కేటాయించాలని తీర్మానం చేశారు. పట్టణంలోని ఎల్‌ఈడీ స్ట్రీట్ లైటింగ్ మెయింటెనెన్స్ కోసం రూ.15లక్షలు సర్వీస్ చార్జ్ కింద ఈఈఎస్‌ఎల్ సంస్థకు చెల్లించేందుకు, తదితర అంశాలపై పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

సంక్షిప్త వార్తలు

◆ పౌరహక్కులపై అవగాహన ఉండాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): పౌరహక్కులపై అందరికీ అవగాహన ఉండాలని సర్పంచ్ గాజుల రమేశ్ అన్నారు. మండలంలోని కూరెల్ల గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమానత్వం, సమసమాజ స్థాపనకు రాజ్యాంగంలో పొందుపరిచిన వివిధ చట్టాలను పౌరహక్కులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని కులమతాలకు అతీతంగా మెదలలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హరీశ్, ఏఎస్ఐ పవన్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, గాజుల రవీందర్, కొండేటి నగేశ్, లింగయ్య తతదితరులు ఉన్నారు.

◆ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

హుస్నాబాద్: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశాడు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో వర్షాలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కొనుగోళ్లు వేగవంతం చేయకపోవడంతో రైతులు రోజుల తరబడి మార్కెట్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరాడు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బడుగు రమేశ్, వీరయ్య తదితరులు ఉన్నారు.

◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లిలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన హెల్పర్ మహేందర్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి శనివారం పరామర్శించి, మృతుడి భార్య భాగ్యలక్ష్మికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శారదా, ఉపసర్పంచ్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా వెంకట్రావుపేటలో అనారోగ్యంతో మరణించిన ఈదుగల్ల ఎల్లవ్వ కుటుంబాన్ని పరామర్శించి సాయం అందజేశారు. బంజేరుపల్లికి చెందిన కామొల్ల నాంపల్లి ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సిద్దిపేటలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ నర్సింలు, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్ ఉన్నాడు.

◆ మేడేను విజయవంతం చేయండి

గజ్వేల్‌రూరల్: కార్మికులు, రైతాంగ, వ్యవసాయ కూలీలు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేస్తూ.. కార్మిక, రైతాంగ, ఉపాధి కూలీలకు నష్టం కలిగే విధంగా కార్మిక కోడ్‌లుగా విభజించినట్లు గుర్తు చేశారు. కార్మికులకు రావాల్సిన హక్కులను సాధించుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, ఎల్లం, బాబురావు, అహ్మద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ టార్గెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్‌రూరల్: టార్గెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు టార్గెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సమీర్, ప్రధాన కార్యదర్శి సందీప్‌లు అన్నారు. శనివారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో మే 1న టార్గెట్‌బాల్ పోటీలకు సీనియర్ విభాగంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 15, 16 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని, మరిన్ని వివరాలకు 9550364598లో సంప్రదించాలని సూచించారు.

◆ బీఏఎస్ స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బెస్ట్ అవేలబుల్ స్కూల్ పథకంలో భాగంగా ప్రభుత్వ ఖర్చుతో ఉచిత విద్య అందించేందుకు గాను ఆసక్తి ఉన్న పాఠశాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 1, 5వ తరగతులకు ఎంపిక చేయబడిన విద్యార్థులకు రెసిడెన్షియల్‌కు రూ.42000, నాన్ రెసిడెన్షియల్‌కు రూ.28000 చొప్పున బీఏఎస్ పథకంలో భాగంగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పాఠశాలల నిర్వాహకులు తమ పాఠశాల వివరాలు, గత 5 సంవత్సరాల ఉత్తీర్ణత శాతం వివరాలు, తదితర వివరాలతో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో మే 4 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

◆ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణను అందించనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదునెలల పాటు ఫౌండేషన్ కోర్సు ద్వారా అందించే ఈ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో మే 14లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు ప్రవేశపరీక్ష నిర్వహించి మెరిట్ సాధించిన 100మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9182220112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రాజేంద్రనగర్ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠాపిత దేవతా విగ్రహాలను ధాన్యాధివాసంలో శయనింపజేశారు. ఆలయ ప్రాంగణంలో హోమం కృతువు విశేష ఋణ విమోచన మంత్ర హోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులరాజనర్సు, స్థానిక వార్డు కౌన్సిలర్ రేణుకతిరుమల్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.